క్లుప్తంగా

ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన రాజ్‌కుమార్

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజ్ కుమార్ శనివారం తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్న సమయంలో పిఠాపురం రోడ్డులో గణపతిశాస్త్రి ఇంటి సమీపంలో మోటరు సైకిలుకు అడ్డుగా కుక్క రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో ఆయన అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్సులో మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేడు శాంతి హోమం

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలో రామమందిరం నిర్మాణం అవుతున్న ప్రదేశంలో ఆదివారం ఉదయం శాంతి హోమం జరుగుతుందని భద్రచలం పాదయాత్ర కమిటీ నాయకుడు వాసుదేవ సుబ్బారావు తెలిపారు. గొంచాల గ్రామం నుంచి ఈ నెల 4వ తేదీన సుమారు 400 మంది భక్తులతో కాలినడకన శ్రీరామ రథంతో భద్రాచలం పాదయాత్ర చేసి తిరిగి వచ్చిన సందర్భంగా ఈ హోమం నిర్వహిస్తున్నట్లు పాదయాత్ర కమిటీ నాయకుడు వాసుదేవ సుబ్బారావు తెలిపారు. ఉదయం భక్తులచే పూజలు, అనంతరం హోమం, తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న అమెరికన్లు


హనుమాన్‌ను దర్శించుకుంటున్న అమెరికన్లు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేంచేసిన కార్యసిద్ధి హనుమాన్ (ఆంజనేయస్వామి)ని శనివారం అమెరికాకు చెందిన ఎం.మార్టిన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు వారికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు


బహుమతులు పొందిన విద్యార్థినులు

పిఠాపురం: రాష్ట్రస్థాయి ఎపిఫని ఎడ్యుకేషన్ పరీక్షలో పిఠాపురం బాదం మాధవరావు బాలికోన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయిలో నగదు బహుమతి పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్యాంబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని జి.విజయప్రభ ప్రథమ స్థానం సాధించి రూ.5 వేలు, మనోజ్ఞ ద్వితీయ స్థానం సాధించి రూ.4 వేలు నగదు బహుమతులు పొందారన్నారు. వీరు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో విద్యార్థినుల విజయానికి కృషి చేసిన సైన్సు టీచర్ సుధారాణి, జానకి లను ఆయన అభినందించారు. ఈఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సత్యప్రియ, మాదవి, దుర్గా కుమారి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

కొమరగిరిలో టీడీపీ ప్రచారం

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో శనివారం మాజీ ఎమ్మెల్యే వర్మ బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానంద రెడ్డి, కతారి రాజబాబు, బత్తుల చైతన్య రాజేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న సహాయకులు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కాకినాడ రూరల్ సీడీపీఓ వై.లక్ష్మి శనివారం పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం తూరంగి గ్రామంలో తూరంగి-3 అంగన్‌వాడీ సెంటర్‌కు ఎస్సీ మహిళ, రమణయ్యపేట గ్రామంలో రమణయ్యపేట-1 సెంటర్‌కు జనరల్ మహిళ, కరప మండలం పెదకొత్తూరు అంగన్‌వాడీ సెంటరు బీసీ-బి, వేలంగి గ్రామంలో వేలంగి-4 సెంటర్ నుంచి ఓసీ జనరల్ మహిళ నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సర్పవరంలోని రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేయాలన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

- పాఠశాలల్లో ట్యాబ్‌లు, టీవీల ద్వారా బోధన
- ఉన్నత విద్యకు ఉపకరించేలా సాంకేతికత


ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

సామర్లకోట: పేదల పిల్లలకు నాణ్యతతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా 2022-23 విద్యా సంవత్సరంలో మండల పరిధిలో 1185 ట్యాబ్‌లను విద్యార్థులకు, 182 ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 1208 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వీటిని పదో తరగతి వరకు వినియోగించుకునేలా వాటిలో సిలబస్ పొందుపరిచారు. కంటెంట్‌తో కలిపి ట్యాబ్ విలువ రూ.30వేలు ఉంటుంది. వాటి వినియోగంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు..

నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. దృశ్య రూపకంగా వాటి ద్వారా విద్యాబోధన చేస్తుండడంతో విద్యార్థులు ఆయా పాఠ్యాంశాలను జీవితాంతం గుర్తుంచుకునే వీలుంటుంది. ఉన్నత విద్య నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంతో ఇబ్బంది పడకుండా ఆ మేరకు బోధన ప్రభుత్వ పాఠశాలల్లో సాగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

విద్యకు ప్రాధాన్యం



ట్యాబ్‌ల ద్వారా, టీవీల ద్వారా విద్యా బోధన చేయడం వల్ల ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధంగా ఉంటారు. ఇటువంటి ఆలోచన చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విద్యార్థులు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు.

– తోటకూర సాయిరామకృష్ణ, హెచ్‌ఎం, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుంది



ట్యాబ్‌లు వినియోగించడం ద్వారా తెలియని విషయాలను తెలుసుకోడానికి అవకాశం ఉంటుంది. పాఠశాలలో చెప్పిన విషయాలను ఇంటి వద్ద ట్యాబ్‌లో పునశ్చరణ చేయడం ద్వారా పాఠ్యాంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయి. స్మార్ట్ టీవీల ద్వారా విద్యలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు చూపించడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు.

– వై.శివరామకృష్ణయ్య, ఎంఈఓ, సామర్లకోట

సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ దేవుని ఆశీస్సులు

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం
- కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు


ఒక్క చాన్స్ లోగోను ఆవిష్కరిస్తున్న దొరబాబు, దైవజనులు

పెద్దాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దేవుని దీవెనలు ఎప్పుడూ ఉంటాయని, ఆయన ఆశీర్వాదంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేద్కర్ భవన్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి క్రిష్టియన్ మైనార్టీ పాస్టర్ల అసోసియేషన్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ పెద్దాపురం అధ్యక్షుడు గుర్రాల చందూ స్టీఫెన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ క్రైస్తవులందరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించే విధంగా ప్రార్థనలు చేయాలన్నారు. ఎమ్మెల్యేగా తాను గెలిపొందేందుకు దైవజనులందరూ ప్రార్థించాలని కోరారు. రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం బైబిల్ మిషన్ దైవజనులు ఇమ్మానియేలు రాజు దైవ ప్రసంగం చేసి వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రార్థించారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ కో-ఆప్షన్ సభ్యులు నందూరి కళ్యాణ్, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, క్లాప్స్ అధ్యక్షులు లంక పురుషోత్తమ్ దాస్, మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నంగిన శామ్యూల్ సుదీప్, మడికి సోనీ, పెద్దాపురం, సామర్లకోట పట్టణ, రూరల్ గ్రామాల దైవజనులు పాల్గొన్నారు.

తోబుట్టువుల అనుబంధమే అమృతహస్తం

- ఆద్యంతం అలరించిన నాటిక
- తాటిపర్తిలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం
- ప్రేక్షకులను కట్టిపడేసిన 'బంధం'


అమృతహస్తం నాటికలో ఓ సన్నివేశం


బంధం నాటికలో ఓ సన్నివేశం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శుక్రవారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికలో తొలిరోజు ప్రదర్శించిన అమృతహస్తం, బంధం నాటికలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. నిజజీవితంలో మనుషుల మధ్య అనుబంధాలను కళ్లకు కట్టినట్టు చూపించారు నటీనటులు.

అనుబంధాల ఆవశ్యకతను వివరిస్తూ..

ఒక తల్లి కడుపున పుట్టిన తోబుట్టువుల మధ్య ఉండే ప్రేమానుబంధం చాలా గొప్పది. ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న ఇలాంటి అనుబంధాలను వదిలేస్తే ఎంత నష్టమో, అనుబంధాలు సమాజానికి ఎంత అవసరమో గుర్తు చేయడం అనే ఇతివృత్తంతో సాగిన నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటికకు కావూరి సత్యనారాయణ రచన, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. కావూరి సత్యనారాయణ, ఏపూరి హరి, సరిత, మాధవి తమ నటనతో పాత్రలకు జీవం పోసి ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నారు.

మనిషి జీవితమే ఒక అను'బంధం'

మనిషి జీవితం బధంతో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు, మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు, పెళ్లయ్యాకా పెళ్లాం బిడ్డలు, బంధువులు ఇలా ఎన్నో బంధాలు ముడిపడి ఉంటాయి. మనిషి జీవితంలో ఎదరయ్యే బంధాలు వాటి విలువలను తెలియజెప్పే కథాంశమే బంధం నాటిక. జీవితాంతం కలిసి ప్రయాణం చేసే భార్యభర్తల బంధం చాలా పటిష్టమైనది, విడదీయరానిది, వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడుతుందనే అంశాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. విజయవాడకు చెందిన మైత్రి కళా నిలయం వారు ప్రదర్శించిన ఈ నాటికకు మాడుగుల రామకృష్ణ రచన, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు. టీవీ పురుషోత్తం, ఎస్ఎస్‌కే ప్రసాద్, ఎం,రత్నకుమారి, రాధాకృష్ణ, పి బాబూరావు తదితరులు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

మంత్రి కారుమూరి దృష్టికి డీలర్ల సమస్యలు


మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లయ్య. చిత్రంలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల రేషన్ డీలర్ల సంఘ నేత నందిపాటి పల్లయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని వలసపాకల గ్రామానికి చెందిన పల్లయ్యను మంత్రికి కన్నబాబు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

పంచారామ క్షేత్ర ఈఓగా నీలకంఠ



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయ ఈఓగా బర్ల నీలకంఠను నియమించారు. ఇప్పటి వరకు ఈఓగా పని చేసిన డి.నాగ మల్లేశ్వరరావు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. అంతర్వేదిలో లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ ఉత్సవాలు ఉండటంతో ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించారు. పంచారామ క్షేత్రంలో మార్చి 6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు, స్వామి వారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు సీనియర్ ఈఓ అయిన నిడదవోలులోని కోట సత్తెమ్మ తల్లి ఆలయ ఈఓగా పని చేస్తున్న నీలకంఠను ఇక్కడకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నుంచి శనివారం ఉత్తర్వులు వచ్చాయి. సోమవారం నీలకంఠ బాధ్యతలు స్వీకరించనున్నారు.

రత్నగిరిపై 22న సరస్వతీ పూజ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 22న సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు సత్యకలములు, కంకణాలు బహూకరించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

ఘనంగా లక్ష మోదక హవన యాగం


మహాకాళీ శక్తిపీఠంలో లక్ష మోదక హవన యాగం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై గోశాల వద్ద ఉన్న మహాకాళీ శక్తిపీఠంలో ఉచ్ఛిష్ట గణపతికి లోక కల్యాణార్థం లక్ష మోదక (ఉండ్రాళ్ల) హవన యాగం నిర్వహిస్తున్నారు. మాఘ శుద్ధ పాడ్యమి నాడు ఈ యాగాన్ని ప్రారంభించినట్లు యాగం నిర్వాహకులు నాగాభట్ల రవిశర్మ శనివారం తెలిపారు. ప్రతిరోజూ పదివేల ఉండ్రాళ్లను హోమగుండంలో సమర్పిస్తున్నామన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఏటా మాఘమాసంలో ఈ యాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 20న భీష్మ ఏకాదశి పురస్కరించుకుని పూర్ణాహుతి నిర్వహిస్తామని చెప్పారు. సుమారు పది మంది రుత్విక్కులు యాగం నిర్వహిస్తుండగా మరో పది మంది ఉండ్రాళ్ల తయారీలో పాల్గొంటున్నారు. ఆసక్తి కలిగిన భక్తులు యాగం పూర్ణాహుతిలో పాల్గొనాలని రవిశర్మ కోరారు.

స్వామి ఆశీస్సులతో వేడుకగా కల్యాణం

కాకినాడ: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోనే కాకినాడలో పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవం వైభవంగా సాగిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులతో ఆగమపండితులు గోపీనంబాల శేషాచార్యుల బృందం శాస్త్రోక్తంగా కల్యాణవేడుకను నిర్వహించారని చెప్పారు. ఇటువంటి కల్యాణోత్సవాన్ని కాకినాడలో రెండోసారి నిర్వహించే చక్కని అవకాశం స్వామి ఆశీస్సుల వల్ల తనకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలా ఏర్పాట్లు చేసిన నాయకులు, కార్యకర్తలు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన యువతీయువకులు, ఇతర నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

సాగునీటి సమస్య లేకుండా చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి హరి


పొలాలను పరిశీలించి సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డీవీఎస్ హరి

సామర్లకోట: రైతులకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖాధికారి డీవీఎస్ హరి అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిధిలో మామిళ్లదొడ్డి, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లోని రైతుల పొలాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు సాగునీటి ఎద్దడిపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని హరి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని, ఈకెవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల్లో ఎరువులు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, విస్తరణాధికారి ఎంవీ సతీష్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి నిర్లక్ష్యంపై ఆందోళన

సాగునీటి సరఫరాను అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ బోయనపూడి, గంగనాపల్లి, కొవ్వాడ, రామేశ్వరం ప్రాంతాల రైతులు వీకే రాయపురం ఇరిగేషన్ లాకుల వద్ద శనివారం పురుగుల మందు డబ్బాలతో ధర్నా చేశారు. దాళ్వాకు నీరు ఇవ్వలేమని అధికారులు చెప్పితే పంటలు వేసుకునేవాళ్లం కాదని, ప్రస్తుతం ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టిన తరువాత నీరు అందక పంట పొలాలు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలలో పూడిక పెరిగిపోవడం, తూటికాడ పెరిగి పోవడం వంటి సంఘటనలు ఉన్నా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో రైతులు ఆందోళన చేయడంతో విషయం తెలుసుకున్న ఎస్సై మౌనిక సంఘటనా ప్రదేశానికి చేరుకొని రైతుల సమస్యలను తెలుసుకుని అధికారులకు వివరించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

బాలికల హక్కులపై అవగాహన పెరగాలి


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సామర్లకోట: బాలికల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రొటెక్షన్ అధికారి జి.విజయ అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన, బాలల హక్కుల పరిక్షరణ, బాలలపై జరుగుతున్న వేధింపులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలన్నారు. బాలలపై జరుగుతున్న చర్యలు తమ దృష్టికి వస్తే చైల్డ్‌లైన్ 1098, లేదా పోలీసు 100కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. ఐడీసీఎస్ సూపర్‌వైజర్ ఎ.మంగాదేవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం టి శ్యామ్‌సుందర్, అంగన్‌వాడీ టీచర్లు పి.సూర్యప్రభ, పి.సత్యశార్వాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గ్రంథాలయాధికారులు

పిఠాపురం: గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసొసియేషన్ అధ్యక్షుడు మాడభూషి సంజశ్రీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సంజశ్రీ మాట్లాడుతూ గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కాకినాడకు చెందిన సత్యం స్టడీ సర్కిల్ వారు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. 30 మంది విద్యార్థులకు రూ.30 వేల విలువైన పుస్తకాలను అందజేసామని పిఠాపురం గ్రంథాలయాధికారి రేపాక వెంకటరాము తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సుగంధ మొక్కల పెంపకంపై అవగాహన


తుని శ్రీప్రకాష్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తుని: స్థానిక ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం రైతులు, విద్యార్థులకు సుగంధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జీడీ కిరణ్ బాబు, డాక్టర్ కోటేష్ కుమార్, డాక్టర్ కెవీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు రైతులకు, విద్యార్థులకు సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్‌పై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త కిరణ్‌బాబు మాట్లాడుతూ సుగంధ మొక్కల పెంపకంతో రైతులు చక్కని ఆదాయ పొందవచ్చన్నారు. ఔషధాల తయారీలో సుగంధ మొక్కల నూనెను వినియోగిస్తారన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా దీనిని సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులతో సక్రమంగా వ్యవహరించండి


శంఖవరంలో ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ఖాతాదారుల పట్ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సక్రమంగా వ్యవహరించాలని ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్ బ్యాంక్‌కు వచ్చే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఖాతాదారులు ఎంపీపీ పర్వత రాజబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు మేనేజర్‌ను కలిసి పలు సూచనలు చేశారు. బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులతో అసభ్యంగా ప్రవర్తించడం తగదన్నారు. ఖాతాదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పర్వత వివేక్, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నవదుర్గ సహిత వనదుర్గా హోమం, జీవ కళాన్యాస హోమం, చండీ హోమం, రుద్ర లక్ష్మీ హోమం నిర్వహించారు. అమ్మవారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, క్షీరాభిషేకం చేశారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10.42 గంటలకు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, 11.41 గంటలకు శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీ చైతన్య దంపతులు అమ్మవారి విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ఠ చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా భీష్మాష్టమి వేడుకలు

గండేపల్లి: నియోజకవర్గవ్యాప్తంగా భీష్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మల్లేపల్లి, గండేపల్లి, ఉప్పలపాడు, యల్లమిల్లి, పి. నాయకంపల్లి, జెడ్.రాగంపేట గ్రామాల్లో ఆలయాల్లో భక్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు మహాభారతంలో భీష్ముడి పాత్రను అర్చకులు వివరించారు. నీలాద్రిరావుపేటలో వీరమ్మ పేరంటాలు అమ్మవారి జాతర సందర్భంగా శనివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గోరోజు శనివారం పండితులు సామివారికి సుదర్శనాభిషేకాలు, సుదర్శన హోమం, విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గండి వెంకటలక్ష్మికుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్న దర్శనానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి జీయ్యన్న, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.